

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా


సంపుటి : 7 సంచిక : 283 మంగళవారం 15- 09 - 2026 ఎడిటర్ : బరిగెల శివ ■ పేజీలు : 4 ■ వెల : 5.00

పబ్లిషర్స్ : తెలంగాణ హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూర్, తమిళనాడు చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్









# గణపయ్య సన్నిధిలో ఘనమైన పూజలు

- గణపయ్యను ఘనంగా కొనియాడుతున్నారు.
- వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు.. భక్తిశ్రద్ధలతో గణనాథుడి ఉత్సవాలు.
- భక్తిశ్రద్ధలతో ఘనంగా వినాయక ప్రతిష్ఠాపన.. రోజుకో ప్రత్యేక కార్యక్రమం.. సేవా కార్యక్రమాల్లో యువత ముందంజ.
- భద్రతకు పోలీసుల పటిష్ట చర్యలు.. నిమజ్జన శోభాయాత్రకు ప్రత్యేక బందోబస్తు.
- పూజలు,భజనలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి.
- మహిళలే భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు.
- యువతకు కీలక బాధ్యతలు.. సేవ, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం.
- సీసీ కెమెరాలతో నిఘా.. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు.
- నిమజ్జన మార్గాల్లో భారీ బందోబస్తు.. అత్యవసర సేవలకు ప్రత్యేక ఏర్పాట్లు.
- పర్యావరణ పరిరక్షణపై అవగాహన.. ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని సూచనలు.
- భక్తి, ఐక్యత, సేవకు ప్రతీకగా గణేష్ ఉత్సవాలు.
- డాక్టర్ బరిగెల శివ.



**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆరాధనకు ప్రతీకగా నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలు నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ప్రారంభమై నిమజ్జనంతో ఘనంగా ముగుస్తాయని జై భీమ్ సంస్థల ఫౌండర్ చైర్మన్ డా. బరిగెల శివ పేర్కొన్నారు. వినాయక చవితి రోజున గణనాథుడి విగ్రహ ప్రతిష్ఠాపనతో ప్రారంభమయ్యే ఉత్సవాలు నిమజ్జనం వరకు ఆధ్యాత్మిక, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా కొనసాగుతాయని తెలిపారు.వినాయక మండపాల ఏర్పాటు, విద్యుత్ అలంకరణలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానాలు, ప్రసాద వితరణ, భక్తి కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు తదితర కార్యక్రమాలతో ఉత్సవ వాతావరణం నెలకొంటుందని చెప్పారు. ఈ మొత్తం ఉత్సవాల నిర్వహణలో యువత కీలక పాత్ర పోషిస్తూ భక్తితో పాటు సేవా స్ఫూర్తిని చాటుకోవాలని ఆయన సూచించారు.వినాయక చవితి రోజున ఉదయం నుంచే భక్తులు గణనాథుడి విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో మండపాలకు తీసుకువచ్చి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ప్రతిష్ఠాపన నిర్వహిస్తారని తెలిపారు. గణపతి హోమం, అభిషేకం, ప్రత్యేక అర్చనలు, పుష్పాలంకరణ, నైవేద్య సమర్పణ, మహాహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు దర్శన సౌకర్యం కల్పిస్తారని పేర్కొన్నారు. మండపాల ఏర్పాట్లలో యువత ముందుండి పరిసరాల పరిశుభ్రత, విద్యుత్ అలంకరణలు, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో భాగస్వాములు కావాలని అన్నారు.రెండో రోజు నుంచి ప్రతిరోజూ ఉదయం గణపతి సుప్రభాతం, అభిషేకం, అర్చనలు నిర్వహించడంతో పాటు సాయంత్రం భజనలు, భక్తి గీతాలు, హారతులతో మండపాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందని తెలిపారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, కుటుంబ సమేతంగా భక్తులు పెద్ద సంఖ్యలో గణనాథుడిని దర్శించుకునే సమయంలో రద్దీని క్రమబద్ధీకరించడం, క్యూలైన్ల నిర్వహణ, అవసరమైన వారికి సహాయం చేయడంలో యువత స్వచ్ఛందంగా సేవలందించాలని సూచించారు.మూడో రోజు నుంచి అన్నదానాలు, ప్రసాద వితరణతో పాటు రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, పేదలకు సహాయం, విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా గణేష్ ఉత్సవాలను సామాజిక సేవకు వేదికగా మార్చాలని డా. బరిగెల శివ పిలుపునిచ్చారు. నాలుగో, ఐదో రోజుల్లో ప్రత్యేక అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, భక్తి గీతాలు, చిన్నారుల ప్రదర్శనలతో మండపాల వద్ద సందడి మరింత పెరుగుతుందని తెలిపారు.ఉత్సవాలు కొనసాగుతున్న కొద్దీ భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున పోలీసులు కూడా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. మండపాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, నిమజ్జన మార్గాలు, చెరువులు, జలాశయాల వద్ద భద్రతను పర్యవేక్షించడంతో పాటు విద్యుత్ భద్రత, అగ్నిమాపక ఏర్పాట్లు, అత్యవసర మార్గాలు, భక్తుల రద్దీ నియంత్రణ వంటి అంశాలపై సంబంధిత శాఖలతో సమన్వయం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచడం, మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి చర్యలు భక్తులకు మరింత భరోసా కల్పిస్తాయని తెలిపారు. నిమజ్జన రోజు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా రూట్ మ్యాప్, ట్రాఫిక్ నియంత్రణ ప్రణాళికను సిద్ధం చేసి అదనపు పోలీసు బలగాలను మోహరించాలని సూచించారు.నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని, ప్రజలకు ముందుగానే సమాచారం అందించాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక వేగంతో వాహనాలు నడపడం, ప్రమాదకరంగా వాహనాలపై ప్రయాణించడం, రోడ్లపై అడ్డంకులు సృష్టించడం వంటి చర్యలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.నిమజ్జన ప్రాంతాల్లో వైద్య సిబ్బంది, అత్యవసర సేవలు, తాగునీరు, రక్షణ బృందాలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేయాలని డా. బరిగెల శివ అన్నారు. చెరువులు, జలాశయాల వద్ద ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు అవసరమైన చోట్ల గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బంది, అత్యవసర వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.నిమజ్జన రోజున గణనాథుడికి చివరి పూజలు, అభిషేకాలు, మహాహారతులు నిర్వహించిన అనంతరం విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఏర్పాటు చేసి శోభాయాత్రగా నిమజ్జన ప్రాంతాలకు తరలిస్తారని తెలిపారు. డప్పులు, బ్యాండ్‌లు, భక్తి గీతాలు, మిగతా 2లో

## రాహుల్ ప్రధాని కావాలని కోరుకున్నా

**- వి. హనుమంతరావు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 14, జైభీమ్ న్యూస్:**



రాహుల్ గాంధీ ప్రధాని కావాలని గణనాథున్ని కోరుకున్నట్లు ప్రభుత్వ సలహాదారుడు వి. హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు తెలుగు రాష్ట్ర ప్రజలందరికీ వినా యక చవితి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర యువ తకు ఉద్యోగాలు రావాలని, వారిని నిరుద్యోగపు విషవ లయం నుంచి బయటపడేయాలని వినాయ కుడిని ప్రార్థించినట్లు హనుమంతరావు తెలిపారు.అనంతరం కులగణన, రిజర్వేషన్లపై హనుమంతరావు స్పందించా రు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న జనగణనలో బీసీల ఊసే లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీలకు కూడా అన్యాయం జరుగుతోందని, బీసీల గణనను చేపట్టాలని రాహూల్ డిమాండ్ చేసి నా.. ప్రధాని మోదీ పెడచెవిన పెడుతున్నారన్నారు. బీసీల గణన చేపడితే రాహూల్ గాంధీకి ప్రయోజనం చేకూరుతుందని మోదీ భయపడుతున్నారని ఆయన ఆరోపించారు.దేశంలోనే ప్రథమంగా కులగణన చేపట్టి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రలో స్థానం సంపా దించారని హనుమంతరావు అన్నారు. అధికారం లోకి రాగానే బీసీ కులగణన చేపడతామని క్యాబినెట్‌లో రేవంత్ తీర్మానం చేశారని.. అన్నట్లుగానే బీసీల సంఖ్య ను గణించి.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రి జర్వేషన్లు కల్పించారని ఆయన కొనియాడారు.

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 14, జైభీమ్ న్యూస్:**

పీఆర్వో మహేష్, పీఏ మహేందర్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో గుండాలు చొరబడి దాడి చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ ప్రారంభం రోజున జరిగిన ఘటనలో విచారణ పేరిట తన సిబ్బందిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్‌లో 15 మంది గుండాలు అక్రమంగా చొరబడి వారిపై మూ కుమ్మడిగా దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు.స్థానిక సేవలను పొందండిరేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో రౌడీల రాజ్యం, గుండాల రాజ్యం నడుస్తోంది. ఇది కాంగ్రెస్ గుండాల పనా ? లేక మఫ్టీలో పోలీసులకే ముసుగులు వేసి కుట్రపన్ని దాడి చేయించరా ? అనే అనుమానాలు వస్తు న్నాయని ఆరోపించారు. ఈ ఘటనపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాజకీయ కక్షతో పెట్టిన పోలీసు కేసు విచారణ కోసం స్టేషన్ కు పిలిపించి ఖాకీల సమక్షంలో ఈ దాడి చేయించడం వెనక ముమ్మాటికి ముఖ్యమంత్రి హస్తం ఉందని అన్నారు.ఉదయం విచారణకు రమ్మని చెప్పి చీకటి పడే వరకూ కాలయాపన చేయడం చూస్తే, ముందే ఈ దాడి చేయాలన్న కుట్ర పన్నినట్టు స్పష్టంగా అర్థమవుతోందని పేర్కొన్నారు. హైకోర్టు తదుపరి ఆదేశాల వరకూ



మహేష్, మహేందర్ రెడ్డిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టంగా ఆదేశాలు ఇవ్వడంతో కక్ష సాధింపులో భాగంగానే ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు.ఈ సంఘటనకు హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలి. ముసుగు ధరించిన గుండాల దాడిలో గాయపడ్డ పీఆర్వో మహేష్, పీఏ మహేందర్ రెడ్డి కి వెంటనే రక్షణ కల్పించి మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్ లోపల, బయట ఉన్న అన్ని సీసీ కెమెరాల ఫుటేజీని భద్రపరచా లని కోరారు. ఈ అరాచక పర్వానికి పాల్పడిన ప్రతి ఒక్క కాంగ్రెస్ గుండాను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

## విద్యారంగ సమస్యలపై విద్యా బస్సు యాత్ర

**హైదరాబాద్, సెప్టెంబర్ 14, జైభీమ్ న్యూస్:**



రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను తెలుసుకునేందుకు ఈనెల15 నుంచి 27వ తేదీ వరకు విద్యారంగ బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ ప్రతినిధి అకునూరి మురళి వెల్లడించారు. ఈ యాత్ర రె ండు దశల్లో ఒక్కో దశలో 5 జిల్లాల చొప్పున జరుగు తుందని వివరించారు. తొలిరోజు మంగళవారం ఉదయ ం 10.30 గంటలకు పెద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి మొదలవుతుందని వెల్లడించారు.ఈ యాత్ర తెలంగాణలోని మొత్తం పూర్వ పది జిల్లాలను కవర్ చేస్తుందన్నారు. యాత్ర బృందం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, స్థానికులతో, ముఖ్యంగా తల్లిదండ్రులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకుంటుందన్నారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులతో, విద్యావేత్తలతో, అక్టీవిస్టులతో, స్వచ్ఛంద సంస్థలతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తుం దన్నారు.ప్రైవేట్ పాఠశాలలు, ప్రైవేట్ జూనియర్ కళా శాలల ఫీజులను నియంత్రించి, పర్యవేక్షిం చేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా ప్రభుత్వ విద్యా వ్య వస్థను బలోపేతం చేసేందుకు, రాష్ట్ర బడ్జెట్ లో18 శాతం నిధులను విద్యకు కేటాయించేలా చట్టాలు తీసుకురా వాలన్నారు.యాత్ర బృందంలో ప్రొఫెసర్ పద్మజా షా, మాజీ ఐఏఎస్‌లు ఎం.విరెడ్డి, ఎం. చంపాలాల్, ఎన్. రుబీనా, తమ్మినేని నిర్మల, సృజన యాదవ్, ముప్పూరి కుమారన్న, నిఖిల్ విజయ కృష్ణ, పాలకూరి అశోక్ కుమార్ ఉంటారని వెల్లడించారు.



### వినాయక చవితి
# వేడుకల్లో విషాదం

నల్లగొండ, సెప్టెంబర్ 14, జైభీమ్ న్యూస్:
జిల్లాలో వినాయక చవితి వేడుకల్లో విషాద ఘటన ఘటన చోటుచేసుకుంది. తిరుమలగిరి సాగర్ మండలం చింతపాలెం గ్రామంలో గణేష్ మండపంలో పూజలు నిర్వహిస్తుండగా పూజారి దత్తు (65) గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. వెంటనే అక్కడున్న వారు ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. అయితే మార్గమధ్యంలోనే దత్తు మృతి చెందారు. దీంతో గ్రామంలోవిషాదం నెలకొంది.ఇదిలా ఉండగా.. గణేష్ ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు ఉద్రిక్తతకు దారితీసినట్లు తెలుస్తోంది. తమ మండపంలోనే తొలిపూజ నిర్వహించాలని ఇరు వర్గాలు పట్టుబట్టడంతో పాటూ పూజారి దత్తుతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. పరిస్థితి తీవ్రతరం కాకుండా గ్రామంలోని పెద్ద మనుషులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలకు సర్దిచెప్పారు. అనంతరం పరిస్థితి సద్దుమణగడంతో దత్తు ఓ గణేష్ మండపం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు.

# వివాహితపై యాసిడ్ దాడి



- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

కామారెడ్డి, సెప్టెంబర్14, జైభీమ్ న్యూస్:
యాసిడ్ దాడి జరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మరణించింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం జంగంపల్లిలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏడేళ్ల క్రితం బిక్కనూరుకు చెందిన దివ్యవాణికి నిజామాబాద్‌కు చెందిన వ్యక్తితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత కొంత కాలంగా దంపతుల మధ్య విభేదాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో దివ్యవాణి పుట్టింటిలో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది.ఈ నెల 11వ తేదీన ఇంటి నుంచి ఆమె బయటకు వెళ్లింది. ఆ తర్వాత ఇంటికి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దివ్యావాణి కోసం భర్తతోపాటు కుటుంబ సభ్యులు కూడా గాలిస్తున్నారు. ఆదివారం రాత్రి జంగంపల్లి గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద కాలిన గాయాలతో దివ్యవాణిని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.ఆమెను ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మరణించింది. అయితే భర్తతోపాటు అత్తమామలు దాడి చేయడంతోనే తమ కుమార్తె మృతి చెందిందని దివ్యవాణి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో వైపు ఆమె మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న
# మాజీ మంత్రి తలసాని



హైదరాబాద్, సెప్టెంబర్ 14, జైభీమ్ న్యూస్:
మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ఖైరతాబాద్ లోని పంచముఖ సంకటహర మహాగణపతిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ దానం నాగేందర్ ఆధ్వర్యంలో తలసానిని సన్మానించి గణపతి జ్ఞాపికను అందజేశారు.రాజకీయ వార్తలు చదవండిఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద వినాయకుడిగా ఖైరతాబాద్ గణపతి కి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. 69 సంవత్సరాల నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. 11 రోజుల పాటు పూజలు అందుకునే అతిపెద్ద ఖైరతాబాద్ వినాయకుడిని ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా వచ్చి దర్శనం చేసుకుంటారని చెప్పారు.ప్రజలందరిపై ఆ గణనాధుడి చల్లని దీవెనలు, ఆశీస్సులు ఉండాలి ఆకాంక్షించారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీ కి శుభాకాంక్షలు తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ మండపం వద్ద భారీకెడ్లు ,సీసీ కెమెరాలు, నిమజ్జనం క్రేన్ తదితర ఏర్పాట్లను గతంలో ఉత్సవ కమిటీ వారు చేసుకునే వారని చెప్పారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మంత్రిగా తాను చొరవ తీసుకుని అన్ని రకాల ఏర్పాట్లను ప్రభుత్వం ఆధ్వర్యంలో చేయడం జరిగిందని వివరించారు. ఆయన వెంట ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నాయకులు బాక్సర్ అశోక్, గజ్జెల నగేష్, మహేష్ యాదవ్, రాంరెడ్డి, ఆనంద్, మహేందర్ తదితరులు ఉన్నారు.

# ఈఎస్ఐలో 'అధికార దౌర్జన్యం' ఆరోపణలు!

- ఔట్సోర్సింగ్ ఉద్యోగులపై ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ శ్రీలత, గైనకాలజిస్ట్ డాక్టర్ సువర్ణ ప్రతాపమా?
- డ్యూటీల కేటాయింపు నుంచి మాటతీరు వరకు ఇష్టారాజ్యమంటున్న సిబ్బంది
- 'ఉద్యోగులమా.. ఇంటి పని మనుషులమా?' అంటూ ఆవేదన
- మానసిక వేధింపులు భరించలేక కలెక్టర్‌ను ఆశ్రయించేందుకు సిద్ధం

వరంగల్, 14 సెప్టెంబర్ (జై భీమ్ న్యూస్)
వరంగల్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితిపై తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. ఆసుపత్రిలో వైద్య సేవలు, పరిపాలనా వ్యవహారాలు సజావుగా సాగాల్సిన చోట.. అధికారుల వ్యవహారశైలితో తాము మానసిక వేధింపులకు గురవుతున్నామని పలువురు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ శ్రీలత తో పాటు గైనకాలజిస్ట్ డాక్టర్ సువర్ణ వ్యవహారశైలిపై ఉద్యోగులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. తమపై అధికారాన్ని ప్రదర్శిస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం, అవమానకరంగా వ్యవహరించడం, డ్యూటీల విషయంలో తమను ఇబ్బందులకు గురిచేయడం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు.

**'డ్యూటీ' పేరుతో వేధింపులా?**

ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఆరోపణల ప్రకారం.. తమకు కేటాయించే విధుల్లో స్పష్టత లేకుండా ఇన్‌చార్జ్ ఆర్ఎంఓ ఇష్టానుసారంగా డ్యూటీలు మారుస్తున్నారని అంటున్నారు. ఎలాంటి స్పష్టమైన లిఖితపూర్వక ఆదేశాలు లేకుండానే విధుల విషయంలో ఒత్తిడి పెంచుతున్నారని ఆరోపిస్తున్నారు. ఉద్యోగుల విధులకు సంబంధించిన అధికారిక నిబంధనలు, ఆదేశాలను పక్కన పెట్టి వ్యక్తిగత నిర్ణయాలే అమలు చేస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? ఇన్‌చార్జ్ ఆర్ఎంఓకు ఉన్న అధికార పరిధి ఎంత? డ్యూటీల కేటాయింపునకు సంబంధించిన ఉత్తర్వులు ఉన్నాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారాయి.

**గైనకాలజిస్ట్‌పై తీవ్ర ఆరోపణలు**

మరోవైపు ఆసుపత్రిలో పనిచేస్తున్న గైనకాలజిస్ట్ వైద్యురాలి వ్యవహారశైలిపై కూడా ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోగుల వైద్య పరీక్షలు, వైద్య సేవలపై దృష్టి పెట్టాల్సిన వైద్యురాలు తమపై ప్రతాపం చూపుతున్నారని కొందరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.తమతో మాట్లాడే సమయంలో తీవ్ర పదజాలం ఉపయోగిస్తున్నారని, చిన్న విషయాలకే అవమానకరంగా మాట్లాడుతున్నారని వారు చెబుతున్నారు. తాము కూడా ఉద్యోగులమేనని, తమకు ఆత్మగౌరవం ఉంటుందని.. అయినప్పటికీ తమను గౌరవం లేకుండా చూడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు."మా తప్పు ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోండి.. కానీ వ్యక్తిగతంగా అవమానించడం, మానసికంగా వేధించడం ఎందుకు?" అని కొందరు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

**సూపరింటెండెంట్ పర్యవేక్షణ ఎక్కడ?**

ఆసుపత్రి సూపరింటెండెంట్ తరచుగా అందుబాటులో ఉండకపోవడం వల్ల క్షేత్ర స్థాయిలో జరుగుతున్న వ్యవహారాలపై పూర్తి పర్యవేక్షణ లేకపోతోందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. సూపరింటెండెంట్ వారానికి ఒకసారి లేదా రెండు వారాలకు ఒకసారి ఆసుపత్రికి వస్తున్నారని వారు చెబుతున్నారు.ఈ పరిస్థితిని కొందరు అధికారులు తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూపరింటెండెంట్ నిరంతర పర్యవేక్షణలో ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదనిఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

**ఇతర సిబ్బంది మాటకూ విలువ లేదా?**

ఆసుపత్రిలో పనిచేస్తున్న ఇతర వైద్యులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు సైతం కొన్ని విషయాలను సూచించినా వాటిని పట్టించుకోకుండా తమకు నచ్చిన విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా ఆసుపత్రిలో 'ఎవరి మాట నడుస్తోంది?' అనే ప్రశ్నను తెరపైకి తెస్తోంది. ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో అధికారిక వ్యవస్థకు బదులు వ్యక్తిగత ఆధిపత్యం కొనసాగుతోందా? అన్న అనుమానాలు ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నాయి.

**'ఉద్యోగులమా.. పని మనుషులమా?'**

ఈఎస్ఐ ఆసుపత్రిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ఔట్సోర్సింగ్ సిబ్బందిని గౌరవం




గా చూడటం లేదని, తమను ఇంటి పని మనుషుల్లా చూస్తున్నారని ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమకు అప్పగించిన విధులను నిజాయితీగా నిర్వహిస్తున్నప్పటికీ.. తమ స్థాయిని తక్కువ చేసి మాట్లాడటం, అవమానకరంగా వ్యవహరించడం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. ఉద్యోగం ఔట్సోర్సింగ్‌దే అయినా.. ఆత్మగౌరవం మాత్రం అందరికీ ఒకటే కదా? అని వారు ప్రశ్నిస్తున్నారు.

**మానసిక ఒత్తిడి.. ఆత్మహత్య ఆలోచనల వరకు?**

తమపై జరుగుతున్నట్లు చెబుతున్న మానసిక వేధింపులతో కొందరు ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాము తీవ్ర నిర్ణయాలు తీసుకునే పరిస్థితి వస్తుందని కొందరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.ఈ ఆరోపణలు నిజమైతే ఇది కేవలం ఉద్యోగుల సమస్య కాదు.. తీవ్రమైన మానవతా సమస్య. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది.

**కలెక్టర్ ముందుకు వెళ్లేందుకు సిద్ధం**

తమ సమస్యలపై ఇప్పటికే అంతర్గతంగా పలుమార్లు ఆవేదన వ్యక్తం చేసినా పరిష్కారం కనిపించడం లేదని ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో త్వరలోనే ఉద్యోగులంతా కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.అవసరమైతే మానవ హక్కుల సంస్థలను, స్థానిక ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తామని హెచ్చరిస్తున్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతో పాటు విధులు బహిష్కరించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు.

**ఉన్నతాధికారులు 'స్పెషల్‌ఆడిట్' చేయాల్సిందే!**

ఈ వ్యవహారంపై సంబంధిత ఈఎస్ఐ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగులను ఒక్కొక్కరినీ విడిగా పిలిచి మాట్లాడాలని, డ్యూటీ రోస్టర్లు, విధుల కేటాయింపు ఉత్తర్వులు, ఫిర్యాదులు, హాజరు రికార్డులను పరిశీలించాలని కోరుతున్నారు.ఇన్‌చార్జ్ ఆర్ఎంఓకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఏమిటి? ఔట్సోర్సింగ్ సిబ్బందికి డ్యూటీలు కేటాయించే అధికారం ఏ మేరకు ఉంది? గైనకాలజిస్ట్ విధులు ఏమిటి? ఉద్యోగులపై వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటివరకు ఏమైనా చర్యలు తీసుకున్నారా? అనే అంశాలపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఆరోపణల్లో నిజమెంత? అధికారుల వివరణ ఏమిటి? అన్నది ఉన్నతస్థాయి విచారణతోనే తేలాల్సి ఉంది. అయితే ఉద్యోగుల మానసిక భద్రత, ఆత్మగౌరవం, కార్యాలయ వాతావరణంపై ఇంత తీవ్ర ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అధికారులు ఇకనైనా స్పందిస్తారా.. లేక ఆరోపణలు మరింత ముదిరే వరకు వేచి చూస్తారా? అనేది చూడాలి.

# పెద్దంపల్లి గ్రామంలో టీఆర్పీలో భారీ చేరికలు

భూపాలపల్లి జిల్లా, రేగొండ, జైభీమ్ న్యూస్:
రేగొండ మండలం పెద్దంపల్లి గ్రామం నుండి పెద్ద ఎత్తున యువత తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ)లో చేరారు. పెద్దంపల్లి గ్రామ 8వ వార్డు మెంబర్ అంబటి కార్తీక్తో పాటు పలువురు యువకులు పార్టీలో చేరగా, వారికి టీఆర్పీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ, పెద్దంపల్లి, దుంపిల్లపల్లి గ్రామాల నుండి టీఆర్పీ కుటుంబంలో చేరిన 8వ వార్డు మెంబర్ అంబటి కార్తీక్, ఎర్రబాటి హరీష్, వజ్జీరు కిరణ్, చలుకాని సైలని, బాబా, సిద్ధార్థ తదితరులకు హృదయపూర్వక స్వాగతం తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల హక్కులు, అభ్యున్నతి మరియు రాజ్యాధికారం కోసం టీఆర్పీ చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పార్టీ ఇచ్చే ఆదేశాలను పాటిస్తూ క్రమశిక్షణతో పనిచేసి పార్టీని గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు బలోపేతం చేయాలని కోరారు.ప్రతి కార్యకర్త గడపగడపకు వెళ్లి టీఆర్పీ పార్టీ విధానాలను ప్రజలకు వివరించాలని, బహుజనులు కోల్పోయిన హక్కులు, అవకాశాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు.అంబటి కార్తీక్ మాట్లాడుతూ పార్టీలో చేరిన పెద్దంపల్లి 8వ వార్డు మెంబర్ అంబటి కార్తీక్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల హక్కుల కోసం పోరాడుతున్న టీఆర్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నను ఆదర్శంగా తీసుకుని, భూపాలపల్లి జిల్లాలో టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో బహుజనుల కోసం నిరంతరం జరుగుతున్న పోరాటాలకు ఆకర్షితుడై పార్టీలో చేరినట్లు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి క్రమశిక్షణతో కృషి చేస్తానని అన్నారు. అణగారిన వర్గాలకు రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో జరుగుతున్న పోరాటంలో జిల్లాలోని యువత పెద్ద ఎత్తున కదిలి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీఆర్పీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షులు ఇనుగాల ప్రణయ్ రాజ్, క్రమశిక్షణ కమిటీ సభ్యులు గండు కరుణాకర్, జిల్లా కోశాధికారి జినుకల శ్రీను, భూపాలపల్లి మండల అధ్యక్షుడు మీసాల రాజు, సామల చంద్రశేఖర్, పిట్టల రాంబాబు,జినుకల శ్రీకాంత్, వేల్పుల దేవేందర్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.



# గణపయ్య సన్నిధిలో ఘనమైన పూజలు

మొదటిపేజీ తరువాయి
నృత్యాలతో యువత ఉత్సాహంగా పాల్గొన్నప్పటికీ ఉత్సాహంతో పాటు క్రమశిక్షణను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.శోభాయాత్ర సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడటం, మహిళలు, చిన్నారులు, వృద్ధులకు సహాయం చేయడం, పోలీసుల సూచనలకు సహకరించడం యువత బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనడం, వేగంగా వాహనాలు నడపడం, వాహనాలపై ప్రమాదకరంగా నిలబడటం, ప్రమాదకరంగా నృత్యాలు చేయడం, డీజే శబ్దాన్ని అతిగా పెంచడం వంటి వాటికి దూరంగా ఉండాలని కోరారు."గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా" అంటూ భక్తులు నినాదాలు చేస్తూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికే నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరగాలని ఆకాంక్షించారు.నిమజ్జనం అనంతరం కూడా యువత తమ బాధ్యతను కొనసాగించాలని డా. బరిగెల శివ సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పేరుకుపోయిన పూలు, అలంకరణ సామగ్రి, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని అన్నారు.

పర్యావరణహిత వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వనరులు కలుషితం కాకుండా చూడడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.వినాయక ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలకే పరిమితం కాకుండా ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే సామాజిక ఉత్సవాలుగా నిలుస్తున్నాయని డా. బరిగెల శివ అన్నారు. చిన్నారులు, మహిళలు, యువత, వృద్ధులు, వివిధ వర్గాల ప్రజలు ఉత్సవాల్లో భాగస్వాములవుతూ భక్తి, ఐక్యత, సేవా స్ఫూర్తిని చాటాలని కోరారు.ప్రత్యేకంగా యువత తమ శక్తి, సమయం, ప్రతిభను సమాజ సేవకు వినియోగిస్తూ గణేష్ ఉత్సవాలకు కొత్త శక్తిని అందించాలని అన్నారు. భక్తితో ప్రారంభమై, సేవతో కొనసాగి, ఐక్యతను చాటుతూ, పోలీసుల పటిష్ట భద్రత నడుమ క్రమశిక్షణతో నిమజ్జనంతో ముగిసే గణనాథుడి ఉత్సవాలు సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.గణనాథుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని, సమాజంలో సోదరభావం, ఐక్యత, మానవత్వం మరింత బలపడాలని డా. బరిగెల శివ ఆకాంక్షించారు.



### విఘ్నేశ్వరుడు ప్రతి ఒక్కరి జీవితంలోని

# విఘ్నాలను తొలగించాలి

**- వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన ఆరేగంటి నాగరాజు గౌడ్**

**పర్వతగిరి, 14 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ చైర్మన్, బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆరేగంటి నాగరాజు గౌడ్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. నాగరాజు స్వగ్రామమైన పర్వతగిరి బృందావనం కాలనీలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విఘ్నేశ్వరుడు ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి, ప్రజలకు ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, పాడి పంటలతో రైతు కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అశోక్, శ్రీకాంత్, నాగరాజు, మణి, లవకుమార్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

### విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో

# సుఖసంతోషాలు వెల్లివిరియాలి





**- వినాయక చవితి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు**

**హైద్రాబాద్, సెప్టెంబర్ 14 (జై భీమ్ న్యూస్)**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి విజయాలను అందించే విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కుటుంబ సమేతంగా గణపతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో ప్రజల జీవితాల్లోని ఆటంకాలన్నీ తొలగిపోయి, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం వెల్లివిరియాలని ప్రార్థించారు. ఆదిదేవుడైన గణనాథుని కరుణాకటాక్షాలతో ప్రతి ఇంటా ఆనందం నెలకొనాలని సీఎం ఆకాంక్షించారు. సమాజంలో సౌభ్రాతృత్వం, సద్భావన, మానవతా విలువలు మరింత పరిఢవిల్లాలని కోరుకున్నారు. సకల సంకల్పాలకు విఘ్నాలు తొలగించి, ప్రజల అడుగులను విజయపథంలో నడిపించాలని, ప్రతి ఒక్కరికీ జ్ఞానం, ధైర్యం, సత్ప్రవర్తన ప్రసాదించాలని ఆదిపూజ్యుడైన విఘ్నేశ్వరుడిని ప్రార్థిద్దామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ప్రార్థించారు.

### రాష్ట్ర ప్రభుత్వానికి గణనాథుడు

# సద్బుద్ధిని ప్రసాదించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 14, జైభీమ్ న్యూస్:**

రాష్ట్ర ప్రజలకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణేష్ మండపాలకు పూర్తి సహకారం అందించాలని ప్రభుత్వ యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి 'సద్బుద్ధి'ని ప్రసాదించాలని గణనాథుడిని కోరుకున్నానని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. రైతాంగం పాడిపంటలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం నాంపల్లిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతోపాటు సుఖసంతోషాలతో జీవించేలా గణనాథుడు ఆశీర్వాదం ఉండాలని అన్నారు. ఏటేటా వినాయకుడి పట్ల భక్తి ప్రపత్తులు ఇనుమడిస్తున్నాయని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ఈ ఉత్సవాల్లో ప్రజలు భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఎంతో భక్తిశ్రద్ధలతోపాటు ఉత్సాహాల నడుమ గణపతి నవరాత్రులు, శోభాయాత్రలు ఘనంగా నిర్వహించే అద్భుతమైన సాంప్రదాయం ఉందని టీ బీజేపీ చీఫ్ గుర్తు చేశారు. హైదరాబాద్ మహానగరంతో పాటు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వేలాది గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారని వివరించారు. పండుగ వేడుకలు, నిమజ్జన శోభాయాత్రకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిసేలా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ, జీహెచ్ఎంసీ సహా సంబంధిత శాఖలన్నీ మండపాల నిర్వాహకులకు, భక్తులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. వినాయక పూజలో ఉపయోగించే పూజా సామాగ్రి, ఆచారాలు పర్యావరణంతో ముడిపడి ఉన్నాయని టీ బీజేపీ చీఫ్ వివరించారు. వినాయక పూజలో సమర్పించే పత్రి, పూలు, పండ్లు, పసుపు వంటివన్నీ ప్రకృతితో మనకున్న గాఢమైన బంధాన్ని గుర్తుచేస్తాయని పేర్కొన్నారు. గణపతిపై భక్తితో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవడం కూడా మనందరి ఉమ్మడి సంకల్పం కావాలని అన్నారు. భక్తులంతా భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకుంటూనే, పర్యావరణ పరిరక్షణపై స్పృహ కలిగి ఉండాలని టీ బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు.

**మన సంస్కృతి, సంప్రదాయాలు**
**భవిష్యత్తు తరాలకు తెలియజేయాలి..**

సనాతన ధర్మం, సంస్కృతి సంప్రదాయాలు ఉన్న దేశం.. భారత్ అని మల్కాజ్‌గిరి ఎంపీ అభివర్ణించారు. వినాయక చవితి రోజు ప్రతి ఇంట్లో గణపతి పూజ చేసామని వివరించారు. అన్ని రకాల విఘ్నాలు తొలగిపోవాలని ఆ దేవుడిని కోరుకుంటామని చెప్పారు. మానవత్వాన్ని చాటే గొప్ప వేదిక గణేష్ పండగ అని గుర్తు చేశారు. మన సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాలని ప్రజలకు ఆయన సూచించారు. పరాయి పాలనలో భారత జాతిని హిందూ సమాజాన్ని ఒక్కటి చేయాలనే ఆలోచనతో... స్వాతంత్ర్య సంగ్రామంలో అందరూ ఒక్కటిగా జరుపుకున్న పండుగ వినాయక చవితి అని వివరించారు. భవిష్యత్తు తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలు ఏమిటో తెలిసేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. గణేష్ ఉత్సవ సమితి.. మండపాలు పెట్టిన వాళ్లందరికీ ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.



### దీపావళి నాటికి సీజీహెచ్ఎస్

# వెల్‌నెస్ సెంటర్ సేవలు



**- 12 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం**

**- ప్రతిపాదిత భవనాలను పరిశీలించిన ఎంపీ డా. కడియం కావ్య, సీజీహెచ్ఎస్ అదనపు డీజీ**

**హనుమకొండ, 14 సెప్టెంబర్ (జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు ప్రక్రియ వేగవంతమైంది. వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య చొరవతో అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. దీపావళి నాటికి వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సేవలు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నారు. సోమవారం సీజీహెచ్ఎస్, కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ డా. పర్వీన్ బాలా, వైద్య బృందంతో కలిసి ఎంపీ డా. కడియం కావ్య కేయూ క్రాస్ సమీపంలోని ఆకాశవాణి రేడియో స్టేషన్ ప్రాంగణంలోని ప్రతిపాదిత భవనాలను పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్‌కు అవసరమైన భవన వసతులు, మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. వెల్‌నెస్ సెంటర్‌కు సంబంధించిన ఆర్థిక అనుమతి పెండింగ్‌లో ఉండటంతో ఇటీవల ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య--కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసి త్వరిత గతిన అనుమతులు మంజూరు చేయాలని ఎంపీ డా. కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర అధికారుల బృందంతో కలిసి ప్రతిపాదిత భవనాలను పరిశీలించారు.

**రూ.10 లక్షలు అందించేందుకు సిద్ధం**

దీపావళి నాటికి వైద్య సేవలు ప్రారంభించేలా అవసరమైన మౌలిక వసతులు, వైద్య సదుపాయాలను వేగంగా పూర్తి చేయాలని ఎంపీ అధికారులను కోరారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు తన ఎంపీ నిధుల నుంచి రూ. 10 లక్షలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వెల్‌నెస్ సెంటర్‌ను కేవలం ప్రాథమిక వైద్య సేవలకు పరిమితం చేయకుండా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించే విధంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని డా. కడియం కావ్య తెలిపారు. ఓపీ సేవలు, వైద్య పరీక్షలు, మందులతో పాటు అవసరమైన చికిత్సలు, శస్త్రచికిత్సలకు రిఫరల్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఇప్పటికే మెడికవర్, లెనోవా ఆసుపత్రులతో ఎంప్యానల్‌మెంట్/అనుబంధ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వెల్‌నెస్ సెంటర్ అందుబాటులోకి వస్తే వరంగల్, హనుమకొండతో పాటు పరిసర ప్రాంతాల్లోని సుమారు 12 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి ఆధారిత కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# హనుమకొండలో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాల ప్రారంభం

**- వేయి స్తంభాల దేవాలయం, అంబేద్కర్ జంక్షన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు**

**హన్మకొండ, సెప్టెంబర్ 14 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ నగరంలో గణపతి నవ రాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. చారిత్రక వేయి స్తం భాల దేవాలయంలో ప్రతిష్ఠించిన శ్రీ మహా గణపతి నవరాత్రి ఉత్సవాలతో పాటు అం బేద్కర్ జంక్షన్ వద్ద శ్రీ శివాజీ యువజన భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో వరంగల్ పశ్చిమ నియో జకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూ జలు నిర్వహించారు. సోమవారం ఉద యం వేయి స్తంభాల దేవాలయానికి ఎమ్మె ల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఆయ న సతీమణి నీలిమా రాజేందర్ రెడ్డి చేరుకోగా ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుం భంతో ఘన స్వాగతం పలికారు. అనంత రం ఆలయ మండపంలో కొలువుదీరి న శ్రీ మహాగణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే దం పతులు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం చారిత్రక శ్రీ రుద్రేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు చేశా రు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మ ధ్య మహాగణపతికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి నవరాత్రి ఉత్సవాలను ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయి ని రాజేందర్ రెడ్డి మాట్లా డుతూ గణ నాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మతసామరస్యం, లోకకల్యాణం కోసం గణపతిని భక్తిశ్రద్ధలతో పూజించాలని కోరారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తితో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహిం చాలని సూచించారు. "ప్రకృతిని ప్రేమిం చు.. పర్యావరణాన్ని రక్షించు" అనే సందే శంతో పర్యావ రణహితంగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహి ంచడం అభినందనీయమని పేర్కొ న్నారు. అనంతరం హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ వద్ద శివాజీ యువజన భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన సతీమణి నీలిమా రాజేందర్ రెడ్డి, అల్లు డు విష్ణు రెడ్డితో కలిసి పాల్గొ న్నారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన మట్టి గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని గణనాథుడిని ప్రార్థించా రు. ఐదు దశాబ్దాలుగా శివాజీ యువజన భక్త మండలి ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని



ఎమ్మెల్యే పేర్కొన్నారు. 50 సంవత్సరాలు పూర్తి చేసు కున్న సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ వేడుకలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరిం చుకున్నాయని అన్నారు. సంప్రదాయాలను కొనసాగిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయమని తెలిపా రు. ఈ కార్యక్రమాల్లో వేయి స్తంభాల దేవాలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేందర్ శర్మ, ఈఓ డి. అనిల్ కుమార్, ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గట్టు మహేష్ బాబు, యువ నాయకుడు దేవర విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ కార్పొరేటర్ చాడ స్వాతి శ్రీనివాస్, శ్రీ శివాజీ యువజన భక్తమం డలి సభ్యులు, స్థానిక ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పితామహునిపై

# రాద్ధాంతం వద్దు



- ప్రపంచానికి దిక్సూచి అంబేద్కర్ ఆశయాలు.
- క్రమశిక్షణ జీవితంలో తిరుగులేని మహనీయుడు.
- ప్రపంచ దేశాలు అంబేద్కర్ జయంతిని జ్ఞాన జయంతిగా జరుపుకుంటున్నారు.
- దేశంలోని ప్రధాన నేతలందరూ భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నారు.
- రాజకీయ పరిదులు వేరు రాజ్యాంగ ఆశయాలు వేరు.
- 76 సంవత్సరాల తర్వాత రాజ్యాంగాన్ని కూలదోసే కుట్రలు జరుగుతున్నాయి.?
- దేశ ప్రధాని రాష్ట్ర ముఖ్యమంత్రి భారత రాజ్యాంగాన్ని కాపాడాలి.
- మతపరమైన అంశం చాలా సున్నితమైనది దానిని రాజకీయాలకు వాడుకోవద్దు.
- బావ స్వేచ్ఛ ప్రకటనను నిర్మించింది బాబా సాహెబ్ అంబేద్కర్ మాత్రమే.
- కులం తక్కువ అంటూ అవహేళనగా సోషల్ మీడియాలో మొదలైన వేధింపులు.
- కేయూ అంబేద్కర్ స్టడీ సర్కిల్ మాజీ డైరెక్టర్ ఆచార్య గాదె సమ్మయ్య.

**హైదరాబాద్ జై భీమ్ న్యూస్:-**


ప్రపంచ దేశాలను ప్రభావితం చేసిన మహనీయునిపై అపనిందలు వెయ్యొద్దంటూ కాకతీయ విశ్వవిద్యాలయ అంబేద్కర్ స్టడీ సెంటర్ మాజీ డైరెక్టర్,ఫార్మసీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ మాజీ డీన్,ఆచార్య గాదె సమ్మయ్య పిలుపు నిచ్చారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలులు భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ రాజ్యాంగ ఆధీనంలో పరిపాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.76 సంవత్సరాల తర్వాత భారత రాజ్యాంగాన్ని అపహస్యం చేయడం, అవమానపరచడం కొంతమంది కావాలని పనిగట్టుకొని చేస్తున్నారంటూ వాపోయారు.ప్రస్తుతం భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ భీమ్ రావ్ (బాబాసాహెబ్) అంబేద్కర్‌పై విస్తృతమైన అపనిందలు వేస్తున్నారని వాటన్నిటిని ప్రభుత్వ పెద్దలు పోలీస్ అధికారులు జాగ్రత్తగా పసిగట్టాల్సిన అవసరం ఉందన్నారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇతరుల మనోభావాలు దెబ్బతీసే అంత వారు కాదని తన చిన్ననాటి జీవితంలో ఎదుర్కొన్న అనుభవాలు తన జీవితంలో అనుభవించిన అవమానాలు చరిత్ర తనకు నేర్పిన పాఠాలను అనుభవశాలి రూపంలో భారత రాజ్యాంగాన్ని నిర్మించినారని పేర్కొన్నారు.సుమారు 250కి పైగా బాబాసాహెబ్ అంబేద్కర్‌తో కలిసి భారత రాజ్యాంగాన్ని లిఖించడంలో పాల్గొన్నారని సోషల్ మీడియాలో బహిర్గతమవుతున్న వాదోప వాదనలు ప్రభుత్వాల ఆధీనంలోనికి వస్తాయని అందులో భాగంగా 26 జనవరి 1950న భారత రాజ్యాంగాన్ని దేశవ్యాప్తంగా అన్ని వర్గాలు ఆమోదించాయని ప్రధానంగా పార్లమెంటులో భారత రాజ్యాంగం చట్టం రూపంలో ఆమోదించబడటం రాజ్యాంగానికి ఉన్న బలమైన గర్వమన్నారు.ప్రభుత్వాలకు అనుగుణంగా భారత రాజ్యాంగంలోని అంశాలను పార్లమెంటు చట్టసభల రూపంలో సవరణలు చేసుకుంటుండగా ఆయ రాష్ట్రాల్లో అభ్యంతరకరమైన అంశాలను ప్రభుత్వాలకు అనుకూలంగా లేవని భావిస్తున్న తరుణంలో సుమారుగా ఇప్పటివరకు130కి పైగా అంశాలు సవరణ చేయబడినాయని వాటి ద్వారా ప్రభుత్వాలు ప్రజలకు అనుకూలంగా అట్టి సవరణ చేయబడిన అంశాలతో సేవలందిస్తున్నారని గుర్తించాల్సి ఉందన్నారు.బ్రిటిష్ కాలంలో దళితులు ఎంతటి హీనాతి హీనంగా అవమానపర చబడినారో,జీవనోపాధి లేకుండా గడిపినారో చరిత్రలు స్పష్టంగా తెలియజేస్తున్నాయన్నారు.

నేటికీ భారతదేశంలో అంటరానితనాన్ని అనుభవిస్తున్నది షెడ్యూల్ కులాలేనంటూ గుర్తు చేశారు.సామాజికపరంగా నిమ్న వర్గాలకు చెందిన వాళ్లైనప్పటికిని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన హక్కుల వల్ల ఉన్నతమైన చదువులు చదువుకొని సమాజంలో గొప్పగా జీవిస్తున్నారని ముఖ్యంగా ఉద్యోగాలతో సంబంధం లేకుండా, వ్యాపారాలతో సంబంధం లేకుండా, ఆస్తుల సంపాదనతో సంబంధం లేకుండా, పలుకుబడితో సంబంధం లేకుండా, కేవలం సమాజంలో గౌరవ మర్యాదలతో బ్రతకడం కోసం,గౌరవంగా జీవించడం కోసం సమాజాన్ని ప్రభావితం చేయడం కోసం కావలసినంత పరిజ్ఞానాన్ని సంపాదించుకొనుటకు ఉన్నతమైన చదువులు చదువుకొనుటకు షెడ్యూల్ కులాలకు సదవకాశాన్ని కల్పించిన మహానుభావుడు మాత్రం బాబాసాహెబ్ అంబేద్కర్ అని గర్వంగా చెప్పగలమన్నారు.

కులవృత్తులను, మతవృత్తులను గౌరవించుకోవడంలో భారతదేశంలో ఎనలేని ప్రత్యేకతలు ఉన్నాయని వాటిని పరిధిలు దాటి ఉపయోగించకూడదనేది తన వ్యక్తిగత భావన అంటూ తెలియజేశారు.సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు అన్ని కులాల ప్రజలకు అన్ని మతాల ప్రజలకు అన్ని జాతుల ప్రజలకు సమానమైన హక్కులు కల్పించబడినయని ప్రధానంగా ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నాయన్న సంగతిని ప్రతి ఒక్కరూ మర్చిపోకూడదన్నారు.భారత రాజ్యాంగాన్ని ప్రమాదంలో పడనివ్వకుండా కాపాడుకోవాలని అన్ని వర్గాల ప్రజలను చట్టపరిధిలో న్యాయ పరిధిలో జీవించుటకు ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలన్నారు.

**బావ స్వేచ్ఛ ప్రకటనకు విఘాదం.**

కోట్లాదిమంది కొనియాడుతున్న షెడ్యూల్ కులాలకు చెందిన భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశ ప్రజల యోగక్షేమాలను కొన్ని తరాల వరకు కట్టుదిట్టమైన భద్రత వలయంలో ఉంచారని వాటిని ఆమోదించింది మాత్రం ముమ్మాటికి అగ్రవర్ణాలేనంటూ గుర్తు చేశారు. వాటిని క్రమం తప్పకుండా అన్ని ప్రభుత్వాలు పాటిస్తూ వస్తున్నాయని ఈ సందర్భంగా తెలియజేశారు.తెలంగాణ ప్రాంతానికి చెందిన హమారా ప్రసాద్ అనే వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పిత కథానాయకుడు అంటూ సిద్ధపరచిన పుస్తకాన్ని షెడ్యూల్ కులాల మేధావిగా ఏమాత్రం అడ్డు చెప్పడం లేదంటూ అదే సందర్భంలో ప్రజల మనోభావాలను తప్పు పట్టే విధంగా ప్రపంచ దేశాలు జ్ఞాన పండితుడని కొనియాడే ప్రపంచ మేధావిని కల్పిత నాయకుడని సంబోధించడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధంగా స్పందిస్తాయో వేచి చూడాల్సి ఉందన్నారు.భారతదేశంలోని చట్టాలు భారతదేశంలోని న్యాయస్థానాలు భారతదేశంలోని ప్రభుత్వాలు భారతదేశంలోని ప్రభుత్వ సంస్థలు భారతదేశంలోని ఉన్నతమైన అధికారులు భారత రాజ్యాంగం ఏర్పాటు చేసిన నిర్మాణం ఆధారంగా నడుచుకుంటూ, అనుసరిస్తున్నారని అలాంటిది భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన భావ స్వేచ్ఛ ప్రకటన అనే అంశాన్ని పరిగణలోనికి తీసుకొని హమారా ప్రసాద అనే వ్యక్తి బాబాసాహెబ్ అంబేద్కర్ ను కల్పిత నాయకుడు అనడం ఏమాత్రం సహించలేనిది అన్నారు.అమరా ప్రసాద్ తనకున్న పరిజ్ఞానంతో తనకున్న సమాచారంతో తన భావాన్ని స్వేచ్ఛగా ప్రకటించుకొనే లిఖించుకొనే హక్కులు ఉన్నప్పటికిని ప్రభుత్వాల అనుమతి లేకుండా తన వ్యక్తిగతంగా రచించుకున్న పుస్తకంపై డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఛాయాచిత్రాన్ని పెడుతూ దానిపై కల్పిత కథానాయకుడు అని సంబోధిస్తూ లిఖితపూర్వకంగా రాయడంతో పాటు కోట్లాదిమంది మనోభావాలను ఎంతగానో వేధించడమే కాకుండా, పూర్తిగా దెబ్బతీస్తుందని అన్నారు.బాబాసాహెబ్ అంబేద్కర్ మతాల ప్రస్తావనను రాజ్యాంగంలో తీసుకు వచ్చినప్పుడు వాటికి ఆధారాలు లేవని నిరూపితం చేయగలిగితే చట్ట సవరణ చేసుకునే అవకాశం ఉన్నప్పుడు 76 సంవత్సరాల కాలం ఎందుకు పట్టిందంటూ హమారా ప్రసాద్ ను సూటిగా ప్రశ్నించారు.మతపరమైన అంశం చాలా సున్నితమైనదని కోట్లాదిమంది ఆరాధించుకునే దైవాలను రాజకీయాల వైపు లాగడం సరైనది కాదన్నారు. షెడ్యూల్ కులాలను సోషల్ మీడియాలో ఉచ్చరించడానికి పదజాలాలతో తిడుతూ సామాన్యులపై బూతులు తిట్టడం అనేది హమారా ప్రసాద్ పుస్తక రచన తదనంతరమే ప్రారంభమైందని గుర్తు చేశారు.ఇతర మతస్తులపై చట్టపరిదులను న్యాయస్థాన పరిధులను ఉల్లంఘిస్తూ దాడులు చేస్తామని ఒక ఇంటర్వ్యూలో ప్రసాద్ మాట్లాడడం దేనికి నిదర్శనమో స్పష్టం చేయాల్సి ఉందన్నారు.కేంద్రప్రభుత్వం అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు పూర్వమే భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్రను,తను ఎంతో పరిజ్ఞానంతో రచించిన ప్రాముఖ్యమైన పుస్తకాలను పరిగణలోనికి తీసుకొని చట్టం రూపంలో ఆమోదించాకే భారత అత్యున్నత పురస్కారమైన భారతరత్నతో గౌరవించడమే కాకుండా తను చదువుకున్న డిగ్రీలు, డాక్టరేట్లు, మరేమేధావి చదువలేక పోయాడని,అంతటి మహనీయుని ప్రపంచ దేశాలన్నీ వాళ్ల వాళ్ళ ప్రఖ్యాతగాంచిన విశ్వవిద్యాలయాలలో అంబేద్కర్ విగ్రహాలతో గౌరవించుకోవడమే కాకుండా తనకున్న గుర్తింపు ప్రపంచ దేశాల్లోని యువత ఆస్వాదించే విధంగా అత్యంత గౌరవప్రదమైన మర్యాదను ఇస్తుండగా తెలంగాణ రాష్ట్రంలో హమారా ప్రసాద్ అనే వ్యక్తి కల్పిత నాయకుడు అంటూ సంబోధించడం ఎంతవరకు సబబు అంటూ సూటిగా ప్రశ్నించారు. కల్పిత నాయకుడు అనే అంశం ఏ ప్రాతిపదికన ఏ సందర్భంగా ఏ ఉద్దేశంతో లిఖించాడనేది స్పష్టత లేదన్నారు.హమారా ప్రసాద్ ఆలోచనలు ప్రకారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పిత నాయకుడు అయినప్పుడు, రాజ్యాంగ రచనలో పాల్గొని లిఖితపూర్వకంగా సంతకాలు చేసిన సభ్యులు కూడా కల్పిత నాయకులేనా అంటూ సూటిగా ప్రశ్నించారు.అదే సందర్భంగా 76 సంవత్సరాలు భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూ ప్రభుత్వాలు వాళ్ల ఏర్పాటు చేసిన విధానాలు పూర్తిగా తప్పేనానంటూ! గుర్తు చేశారు.భారత రాజ్యాంగ పరిధిని బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అగౌరవ పరచడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులను అగౌరవపరచడమే అంటూ గుర్తు చేశారు.కాలం సంపూర్ణతకు అనుకూలంగా భారత రాజ్యాంగం రచనలు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు కొనసాగుతూనే ఉంటాయని కోట్లాదిమంది గొంతుకగా నిలుస్తున్న భారత రాజ్యాంగాన్ని అవమానపరచడం ఇకనైనా మానుకోవాలని సూచించారు.పండుగ సందర్భాలు అని గుర్తించకుండా వికృతమైన సోషల్ మీడియా పోస్టులతో బాబాసాహెబ్ అంబేద్కర్ పై అసభ్యంగా పదజాలాలతో దూషిస్తూ సమాజాన్ని తప్పుతో పట్టిస్తున్న వ్యక్తుల పట్ల భారత సమాజం,మేధావివర్గం చాలా అప్రమత్తంగా ఉండాలని కోరడంతో పాటు ప్రభుత్వాలు తక్షణమే హమారా ప్రసాద్ అలాంటి వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాల అనుమతి లేకుండా భారత రాజ్యాంగంపై బాబాసాహెబ్ అంబేద్కర్ పై కల్పిత కథలు కల్పిత కథనాలు కల్పిత పుస్తకాలు సృష్టిస్తున్న వ్యక్తులను శక్తులను ప్రభుత్వాలు ప్రభుత్వ వ్యవస్థలు ,చట్టపరంగాను న్యాయపరంగాను, కఠినంగా శిక్షించాలని కోరినారు.తద్వారా సమాజంలో శాంతి భద్రతలు విఘాతం కలగకుండా శాంతింపజేసే మార్గాలను ఏర్పాటు చేసిన వాళ్లు అవుతారని కోరినారు.



## విచారణ పేరుతో వేధింపులకు

# పాల్పడడం దారుణం

**హైదరాబాద్ జై భీమ్ న్యూస్:-**

రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణలో శాంతి భద్రతలు రోజురోజుకు దిగజారుతున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు.ప్రపంచ పటాలు పరిశీలించండి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ మహేందర్ రెడ్డి , పీఆర్వో మహేష్‌ను వినాయక చవితి రోజున విచారణ పేరుతో సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడం దారుణమని అన్నారు.వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు.పోలీసుల సమక్షంలోనే మాస్కులు ధరించిన 15 మంది కాంగ్రెస్ కార్యకర్తలు మహేందర్ రెడ్డి, మహేష్‌పై దాడి చేయడానికి యత్నించడం మరింత ఆందోళనకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు అడ్డుకోవడంతో వారు అక్కడి నుంచి పారిపోయిన ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.పోలీస్ స్టేషన్‌లోనే దాడికి యత్నించే స్థాయికి కాంగ్రెస్ గుండాల అరాచకం పెరగడం తెలంగాణలో శాంతి భద్రతల పరిస్థితికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు. దాడికి యత్నించిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ‘అహం’ అడ్డురాకుండా

# చూసుకుంటే సమస్తం సరి

- ఆవేశం కంటే ఆలోచన.. ఉద్రేకం కంటే ఉపాయం.. సమాజహితం వైపు అడుగులు వేయాలి
- సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత డా. మేడపాటి ఇమ్మానుయేల్

**అమరావతి, 14 సెప్టెంబర్ (జై భీమ్ న్యూస్)**

మనిషి జీవితంలో అహంకారం, ఆవేశం, ఉద్రేకం, అనాలోచిత నిర్ణయాలు ఎన్నో సమస్యలకు కారణమవుతున్నాయని, వాటికి దూరంగా ఉంటూ ఆలోచన, సహనం, వివేకం, కార్యాచరణతో ముందుకు సాగితే జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను సులభంగా అధిగమించవచ్చని సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత డా. మేడపాటి ఇమ్మానుయేల్ తెలిపారు. “అమ్మో... అహంకారమెందుకు? అయ్యో... అవగాహన అవసరం గాని! అమ్మో... ఆవేశమెందుకు? అయ్యో... ఆలోచన అవసరం గాని!” అంటూ మనిషి ప్రతి సందర్భంలోనూ ముందుగా ఆలోచించి, పరిస్థితిని అర్థం చేసుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇబ్బందులు ఎదురైనప్పుడు చిరాకు, ఇరిటేషన్‌కు లోనుకాకుండా ప్రశాంతంగా వ్యవహరించాలని, నిరంతర

ఒత్తిడి, అసహనం ఆరోగ్య సమస్యలకు కూడా పునాదిగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదే విధంగా ఉద్రేకంతో సమస్యలను మరింత క్లిష్టతరం చేయకుండా, సమస్యకు పరిష్కా రం చూపే ఉపాయాన్ని ఆలోచించాలని, “అమ్మో... ఉద్రేకమెందుకు? అయ్యో... ఉపాయమవసరం గాని!” అనే సందేశంతో వివేకంతో వ్యవహరించాల్సిన అవసరాన్ని వివరించారు. కేవలం ఊహల్లో విహరిస్తూ కాలం గడపడం కంటే సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని, “అమ్మో... ఊహల్లో విహరించకు! అయ్యో... ఊరికి మేలు చేయ్!” అంటూ ప్రతి ఒక్కరూ తమ ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రకృతిలో చోటుచేసుకుంటున్న మార్పులు, ఋతువుల్లో వస్తున్న పెను మార్పులు, ఎల్‌నినో వంటి వాతావరణ ప్రభావాలు ప్రజల జీవన విధానంపై, వ్యవసాయంపై, పర్యావరణంపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కుటుంబ వ్యవస్థలోనూ పరస్పర అవగాహన, సహనం, గౌరవం లోపించినప్పుడు బంధాలు బలహీనపడుతున్నాయని, “ఏడడుగుల బంధాలెన్నో ముక్కలు” కాకుండా కుటుంబ సభ్యులు ఒకరినొకరు అర్థం చేసుకుని, గౌరవించుకుని బంధాలను కాపాడుకోవాలని సూచించారు. సమాజంలో ఎందరో ఆదర్శవంతమైన వ్యక్తులు ఉన్నారని, వారి జీవిత అనుభవాలు, మంచి ఆలోచనలు, విలువలను తెలుసుకుని వాటిని మన జీవితాల్లో అనుసరించాలని, “ఎందరో ఐడియల్ పర్సన్స్ మనకు... వారి ఐడియాలను ఫాలో అవ్వాల్సిందే” అని పేర్కొన్నారు.ఒక నది లక్షలాది మందికి అమృతంలాంటి జీవనాధారంగా నిలుస్తుం దని, అదే విధంగా మనిషి జీవితంలో మంచి ఫలితాలు రావాలంటే కృషి, శ్రమ, పట్టుదల, నిరంతర ప్రయత్నం తప్పనిసరి గా ఉండాలని తెలిపారు. “ఔట్‌పుట్ రావాలంటే వర్క్ ఇన్‌పుట్ ఉండాల్సిందే” అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, కష్టపడకుండా విజయాన్ని ఆశించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అంబానీల స్థాయికి ఎదగాలని కోరుకో వడంలో తప్పేమీ లేదని, ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆర్థికం గా, సామాజికంగా, వ్యక్తిగతంగా ఎదగాల ని ఆకాంక్షించడం సహజమని అన్నారు. అయితే ఎంతటి ఉన్నత స్థాయికి చేరుకున్నా అహంకారానికి మాత్రం తావి వ్వకూడదని సూచించారు. సంపద, హోదా, అధికారం, విజయం పెరిగే కొద్దీ వినయం, మానవత్వం, సామాజిక బాధ్యత కూడా పెరగాలని పేర్కొన్నారు. వ్యక్తిగత అభివృద్ధి తో పాటు సమాజ అభివృద్ధిని కూడా లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని, అహంకారాన్ని పక్కనపెట్టి ఆలోచనతో, సహనంతో, వివేకంతో, ఉపాయంతో సమస్యలను పరిష్కరించుకోవాలని డా. మేడపాటి ఇమ్మానుయేల్ తెలిపారు. మనిషి తనలోని “అహం”ను జయించినప్పుడే నిజమైన విజయం సాధించినట్లవుతుందని, “అహం అడ్డురాకుండా చూసుకుంటే సమస్తం సరి” అనే ఆలో చన ను ప్రతి ఒక్క రూ జీవిత సూత్రంగా స్వీక రించి, కుటుంబం, స మాజం, దేశం కోసం సాను కూలంగా పనిచేయాలని ఆయన పిలు పునిచ్చారు.



సామాజిక శాస్త్రవేత్త, కవి, రచయిత, డా. మేడపాటి ఇమ్మానుయేల్